క్లుప్తంగా

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



టెంట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ కేపీ, డీఆర్‌డీఏ సహకారంతో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జీ అజితకు యూనియన్ బ్యాంక్ వారు టెంట్ హౌస్ నిర్వహణకు రూ.5 లక్షలను రుణంగా పీఎంఈజీపీ ద్వారా అందించారు. ఈ సందర్భంగా చెంచిరెడ్డి టెంట్ హౌస్‌ను ప్రారంభించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



స్కిట్ ప్రదర్శిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

మద్దిపాడు: మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై నృత్యరూపాలు, పలు రకాల స్కిట్‌ల ద్వారా ఒంగోలు రిమ్స్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతులను పరిశుభ్రం చేసుకునే విధానంపై వారి ప్రదర్శన ఆకట్టుకుంది, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి పాఠశాల విద్యార్థులకు వారు వివరించారు, అయోడిన్ లోపం, ఐరన్ లోపం వలన కలిగే దుష్పరిణాల గురించి స్కిట్లు ప్రదర్శించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవిత విధానం, మంచి అలవాట్ల గురించి అర్థమయ్యేలా వివరించారు. పాఠశాల హెచ్‌ఎం అజీమ్, కోటిరెడ్డి, రిమ్స్ ఫ్యాకల్టీ అనూరాధ, పలువురు నర్సింగ్ విద్యార్థినులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఒంగోలు టౌన్: వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సామాజిక ఆరోగ్య అధికారులకు పూర్తి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జె.రమేష్, ఎం. రవికుమార్ నేతృత్వంలో సోమవారం జిల్లా వైద్యాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు జీవనజ్యోతి, జి.ప్రసన్న, షేక్ అమీనుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 17 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ఒంగోలు సిటీ: ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 17 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్పందనలో టౌన్ ప్లానింగ్‌కు విభాగానికి 4 అర్జీలు, టిడ్కో గృహాలకు 4 అర్జీలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు.



చీమకుర్తిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు



బి.నిడమానూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పులికొండ గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యద్దనపూడి, పమిడి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గత టీడీపీ పాలనతో పోలుస్తూ వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే ఈ పథకాలన్నీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, సర్పంచ్ రాజేంద్ర కుమార్, కడియాల మల్లికార్జున, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీ నిడమానూరులో...

నాగులుప్పలపాడు: మండలంలోని బీ నిడమానూరు గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు చేతుల మీదుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాల పేరుతో ప్రజలను నిలువునా ముంచిన చంద్రబాబుకు కాలం చెల్లిందదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. ముందుగా సొసైటీ ప్రాంగణంలో ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామ కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలోని ముఖ్య కూడలిలో ప్రజలతో సమావేశం నిర్వహించి జగనన్న ఉత్తమ పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మరి సుధాకర్, ఉప సర్పంచ్ గంద్ర రమణారెడ్డి, పులిచర్ల పరంధామిరెడ్డి, బడే అంకిరెడ్డి, ఈవోఆర్డీ ఏవీ కుమారి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

మద్దిపాడు: మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బసవన్నపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు మాట్లాడుతూ సీఎం జగన్ తమకు చేసిన మేలును జీవితకాలం మర్చిపోలేమని, మళ్లీ ఆయన్నే సీఎం చేసుకుంటామని నినదించారు. గత ప్రభుత్వంలో తమకు మేలు జరగలేదని, ఇప్పుడున్న ప్రభుత్వంలో అంతా మంచి జరిగిందని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అరుణ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడం కోసం ముఖ్యమంత్రి నిత్యం తపన పడుతుంటారని, అటువంటి వ్యక్తిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు పూనాటి చిన్న అప్పారావు గుడ్డపాతల రవి, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, జేసీఎస్ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాసరావు, పైనం ప్రభాకర్ గ్రామ సర్పంచ్ రావి అరుణ, ఉప సర్పంచ్ కోవి శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెబ్బవరపు ప్రమీల, సచివాలయ కన్వీనర్లు రావి రవి, నల్లూరి రాంబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని మండల సచివాలయాల కన్వీనర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఈతముక్కల సచివాలయం-2లో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.28.22 కోట్ల సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందని కుటుంబం లేదన్నారు. పథకాలన్నింటిలో మహిళలను భాగస్వాములను చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి పేదవాడు బాగా చదువుకుని డాక్టర్లు, ఇంజినీర్లు కావాలనే ఉద్దేశంలో నాడు-నేడు ద్వార పాఠశాలలను రూపురేఖలను మార్చారన్నారు. ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలూ ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. జగనే సీఎం ఎందుకు కావాలంటే కార్యక్రమానికి నోడల్ అధికారి ఏ.బాలచెన్నయ్య మానమ్మకం నువ్వే జగనన్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. అనంతరం సచివాలయం ఆవరణలో రోడ్డు వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను రవీంద్రరెడ్డి, గ్రామస్తుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల రిసోర్స్‌పర్సన్ కో ఆర్డినేటర్ కసుకుర్తి శ్రీనివాసరావు, బండారు వెంకటసుబ్బారావు, సచివాలయం కన్వీనర్లు నాయుడు స్వాములు, పటాన్ నజీర్, రావుల భాగ్యలక్ష్మి, మాకాని రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నితిన్, కిరన్, పుల్లయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బసవన్నపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు, నాయకులు



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి భజన



అయ్యప్పస్వామి మెట్లకు పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి మహాపూజ పడిభజన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి మెట్లను సుందరంగా అలంకరించి దీపారాధన చేసి పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులచే భక్తిగీతాలను ఆలపించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు సెంట్రల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆవరణలో సోమవారం బాల కార్మిక వ్యవస్థ అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను చదువుకునే సమయంలో చదివించాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్వేచ్ఛగా బాలలను ఎదగనిస్తే భావిభారత పౌరులుగా మంచి సమాజం నిర్మాణంలో తమవంతు పాత్ర పోషిస్తారని అన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమ శాఖ ద్వారా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మరిల్లులో చిన్నారులతో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఒంగోలు టౌన్: బాలల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని రిమ్స్ డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్ అన్నారు. భాగ్యనగర్‌లోని బొమ్మరిల్లు అనాథ ఆశ్రమంలో సోమవారం అంతర్జాతీయ బాలల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. బాలల హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా వారికి నిజమైన స్వేచ్ఛను కలిగించినట్లవుతుందన్నారు. నిరాధాణకు గురైన బాలలకు ఆప్యాయత పంచాలని, ప్రేమను పంచాలని చెప్పారు. అనాథ బాలలకు వసతి కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనాథబాలలకు ఉచిత వైద్యం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉన్నామని ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జాన్ రిచర్డ్స్ చెప్పారు. దశాబ్దకాలంగా అనాథ బాలలకు సేవలు అందిస్తున్న బొమ్మరిల్లు కాశిం, రాజ్యలక్ష్మి దంపతులను అభినందిస్తున్నట్లు చెప్పారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ బీవీ సాగర్, రిమ్స్ వైద్యులు శరత్, బొమ్మరిల్లు నిర్వాహకులు ఎస్కే ఖాశీం పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కొత్తపట్నం: మన భవిష్యత్‌కు గ్రంథాలయాలు దిక్సూచిలుగా ఉపయోగపడతాయని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కోడూరి ధనలక్ష్మి అన్నారు. 56వ జాతీయ గ్రంథలయ వారోత్సవాలు ముగింపు వేడుకల్లో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తకాలు అలవాటు చేసుకోవాలన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రంథపాలకులు సీహెచ్ అజయ్‌బాబు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఏడుగుండ్లపాడులో విద్యార్థులతో గ్రంథపాలకురాలు రోహిణి



సంతనూతలపాడులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

చీమకుర్తి: గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14న మొదలై సోమవారంతో ముగిశాయి. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రతి ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా వారం రోజుల నుంచి సంతనూతలపాడు గ్రంథాలయంలో స్థానిక లైబ్రేరియన్ కే సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రంగాలలోని అంశాలపై వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, ఎంఈఓ, టీచర్ల ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని మద్దిపాడు, ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. గ్రంథపాలకులు వసుంధర, రోహిణి పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ జయమ్మ

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యాక్రమంలో గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొలకలూరి విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గత 6 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాదాసు రాంబాబు, కార్యదర్శి శ్రీరామమూర్తి, పెంట్యాల శ్రీనువాసరావు, గ్రంథపాలకురాలు నాగరజని, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే వేగవంతం చేయండి

● ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

ఒంగోలు రూరల్: కులగణన సర్వేను వేగంగా పూర్తిచేయాలని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అన్నారు. కరవది సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన సచివాలయ ప్రాంగణంలో జరిగిన 7 గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సర్వే 7 రోజులకు గాను 5 రోజుల్లో పూర్తిచేసి మిగిలిన 2 రోజులు పూర్తిస్థాయిగా వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఒంగోలు తహసీల్దార్ కుల ధృవీకరణ తప్పనిసరిగా జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలని ఆయన కోరారు. ఎంపీడీఓ పి.అజిత మాట్లాడుతూ సర్వేను నిర్దేశించిన కాలం లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శుల, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమష్టిగా పీహెచ్‌సీని అభివృద్ధి చేయండి



విచారణ చేస్తున్న డాక్టర్ పద్మజ, పక్కన ఎంపీపీ

ఒంగోలు రూరల్: సిబ్బంది అంకితభావంతో సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ అన్నారు. ఏపీ మహిళా కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. సీనియర్ ఏఎన్‌ఎం మస్తానమ్మ స్థానిక వైద్యుడు సుందర్‌ప్రసాద్‌పై చేస్తున్న అభియోగాలపై విచారించారు. బాధితురాలు ఏఎన్‌ఎం మస్తానమ్మను, డాక్టర్ సుందర్‌ప్రసాద్‌ను ప్రత్యేకంగా విచారించారు. చింతాయగారిపాలెం సహచర ఏఎన్‌ఎం రవికుమారి రిపోర్టు, సీహెచ్‌ఓ రిపోర్టును రికార్డు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, హెచ్ఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఆత్మ పీడీ అన్నపూర్ణ



రైతులకు సూచనలు ఇస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

ఒంగోలు సెంట్రల్: రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ తెలిపారు. చీమకుర్తి మండలం కెవీపాలెంలో పలు పంటలను సోమవారం పరిశీలించారు. మిరప, కంది, పొగాకు వరి పొలాలను పరిశీలించి ప్రస్తుతం ఆయా పంటలకు ఆశించిన పలు తెగుళ్లను, పురుగులను గమనించి నివారణ చర్యలను సూచించారు. సాగు ఖర్చును తగ్గించుకోవాలని చెప్పారు. కందిలో కళ్లకు రాక ముందే ఎసిఫెట్ వంటి మందులతో పాటు వేప నూనె కలిసి వాడితే మారక మచ్చ పురుగు ఉధృతి ఉండదని చెప్పారు. డీఆర్‌సీ ఏఓ వీవీ శేషమ్మ, ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

కనులపండువగా నగరోత్సవం



కాశీ విశ్వనాథుని నగరోత్సవాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: పవిత్ర కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి నగరోత్సవం నంది వాహనంపై పురవీధుల్లో కన్నులపండువగా సాగింది. నగరోత్సవంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణ అధికారి డి.రజనీ కుమారి ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్బాబు ఆలయ అర్చక స్వాములు శంకరమంచి రామకృష్ణ శంకరమంచి ప్రసాదశాస్త్రి పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం మొదటి సోమవారం నగరంలోని పలు ఆలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. స్థానిక కేశవస్వామిపేటలో వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం కొత్తపట్నం బస్టాండ్ దగ్గర ఉన్న శివాలయంలో, లాయరుపేట షిర్డీ సాయిబాబా మందిరంలో కొలువైయున్న మరకత శివలింగం, అంజయ్యరోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం, రంగారాయుడు చెరువు దగ్గరున్న శివాలయంలో తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చక స్వాములు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.